నేడు వైఎస్సార్ యంత్ర సేవ మెగా మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ శుక్రవారం ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 30 మండలాలకు సంబంధించి రూ.3736.187 లక్షల విలువ గల 328 యంత్ర సేవా పరికరాలను రూ.1294.537 లక్షల రాయితీతో రైతుసంఘాలకు అందించనున్నట్లు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల స్థాయిలో రూ.3186.187 లక్షల విలువ గల 269 ట్రాక్టర్లను 306 సిహెచ్‌సి గ్రూపులకు రూ.1100.937 లక్షల రాయితీతో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.550 లక్షల విలువ గల క్లస్టర్ లెవల్ వ్యవసాయ పరికరాలను రూ.193.60 లక్షల రాయితీతో రైతు సంఘాలకు అందజేయనున్నట్లు తెలిపారు.

'వంశధార' ఆధునికీకరణ ఎప్పుడో?

- రూ.834 కోట్లతో వంశధార ఎల్‌ఎంసి ఆధునికీకరణకు ప్రతిపాదనలు
- ఆర్‌ఎంసి లైనింగ్ పనులకు రూ.18.35 కోట్లు
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- ఆమోదం తెలపని ప్రభుత్వం

వంశధార కాలువల ఆధునికీకరణ పనుల కోసం ఎదురుచూపులే మిగిలాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధునికీకరణ పనులకు 2021-22 ఫిబ్రవరిలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. రెండేళ్లుగా ప్రభుత్వం వద్దే ఫైల్ పెండింగ్‌లో ఉండిపోయింది. ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడంతో ఆధునికీకరణ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. కుడి, ఎడమ కాలువలు బలహీనంగా ఉండడంతో గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు ఉంటున్నా కాలువ గట్టు పటిష్టంగా లేకపోవడంతో, సామర్థ్యం మేరకు నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది. ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో రైతులకు మరో నష్టం వాటిల్లుతోంది. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో కొన్నిచోట్ల గండి పడిన ఘటనలూ చోటుచేసుకున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువలు నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంతో అంతకుమించి నీటిని వదిలితే గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరం పలాస, వజ్రపు కొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది.

క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు ఎడమ కాలువను ఆధునీకరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. దీంతో అంచనా వ్యయం పెరగడంతో మరోసారి అధికారులు 2022-23 సంవత్సరపు ఎస్ఎస్ఆర్ రేట్లతో అంచనాలు రూపొందిస్తున్నారు.

కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో 18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఏడాది గడిచినా ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో 2022-23 రేట్లతో కొత్త ఎస్-ఎస్ఆర్‌తో అంచనాలను తయారు చేస్తున్నారు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో ఈ సంవత్సరం రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. గత నెలలో వంశధారలో 80 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపు గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా గతేడాది జులైలో హిరమండలం అక్కరాపల్లి అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దాన్ని రూ.ఐదు లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ ఆమోదం కోసం చూస్తున్నాం

వంశధార కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వానికి 2021-22లో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ ఆమోదం కోసం చూస్తున్నాం. అంచనాల ప్రతిపాదనలకు ఇప్పటివరకు క్లియరెన్స్ రాలేదు. ప్రభుత్వ సూచనలతో కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతాం.

- దోల తిరుమలరావు, వంశధార సర్కిల్ ఎస్ఇ

సంఘీభావం ప్రకటిస్తున్న వామపక్ష నాయకులు

జీడి మద్దతు ధరపై 8న ధర్నా

- ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలి
- వామపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం జీడికి మద్దతు ధర ప్రకటించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాను చేపట్టనున్నట్లు వామపక్ష నాయకులు వెల్లడించారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా చేస్తామంటూ నిరంతరం ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, జీడిపిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో జీడి రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి రైతులు అన్యాయానికి గురవుతుంటే శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. జీడి రైతు సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు.

గతం కంటే జీడి పిక్కల ధర తగ్గినా, జీడిపప్పు ధర పెరగడంతో అటు రైతాంగం, ఇటు వినియోగదారులు అన్యాయానికి గురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటున్న బిజెపి, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వాలు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు ఇవ్వాలని, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోతే జీడి రైతులతో కలిసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ నాయకులు కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

- 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహణ
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఇన్‌ఛార్జి డిఆర్ఒ పి.మురళీకృష్ణ

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఆర్ఒ మురళీకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. ఈనెల 3 నుంచి పదో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే పరీక్షలకు 353 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు వివరించారు. ప్రతిరోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 09.45 గంటల వరకే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆ సమయం లోగా అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమన్నారు. ఎటువంటి మాస్ కాపీయింగ్, ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఈసారి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాల నిఘాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి కదలికను గుర్తించేలా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సమయానికి చేరుకునే విధంగా బస్సు సదుపాయాలను కల్పించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు.

పరీక్షల సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, ఇతర సదుపాయాలతో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర వసతులను కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్, వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తుతో పాటు పరీక్షా కేంద్రంలోకి ఇతరులను అనుతించరాదని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో సమస్యలు తలెత్తితే ఎపిపిఎస్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.ప్రమీల (9014550846), సెక్షన్ ఆఫీసర్ ఎం.అమ్మాజీ (9014550882) ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. పరీక్షల నిర్వహణను విజయవంతం చేసి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి తిప్పేస్వామి, పరీక్షల లైజన్ ఆఫీసర్ జి.గ్రేస్, చీఫ్ సూపరింటెండెంట్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, అర్బన్ మెడికల్ అధికారి జంపు కృష్ణమోహన్, ఆర్‌టిసి, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియాపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు యాంటీ మలేరియా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ, మున్సిపాల్టీలో యాంటీ లార్వా ఆపరేషన్‌కు అవసరమైన అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం పొడి వారం (డ్రై డే) పటిష్టంగా అమలు చేయాలన్నారు. డెంగీ అనుమానిత జ్వర పీడితుల ఇళ్లలో, ఇంటి చుట్టుపక్కల సైఫైనోత్రిన్ స్ప్రే చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీలోని అన్ని సచివాలయాల్లో మలేరియా, డెంగీలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

నీటి నిల్వలున్న ప్రదేశాలను పంచాయతీ ద్వారా పూడ్చడం, ఎక్కువ ఉన్న వాటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలు, హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ, జిల్లా మలేరియా నివారణ అధికారి పి.వి సత్యనారాయణ, సామాజిక సేవకుడు మంత్రి వెంకటస్వామి, పట్టణ వైద్యాధికారి జంపు కృష్ణమోహన్, ఎఎంఒ ఎస్.శ్రీనివాసరావు, శ్రీకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నాడ పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

ఎచ్చెర్ల : మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ధర్మవరం సచివాలయాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తల అన్ని రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేయరాదని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తూ రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాల్లోని ఎంఆర్ఐ, ఎంఆర్-2 వ్యాక్సిన్లు ఎంతమందికి వేశారని ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎన్‌సిడి సర్వేలో వెనుకబడిన సిబ్బందిపై ఏం చర్యలు తీసకున్నారని వైద్యాధికారి ఎన్.శేషగిరిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆరోగ్య విస్తరణ అధికారి జగన్నాథరావు, పర్యవేక్షకుడు డేవిడ్‌రాజు ఉన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు, మహిళలు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు దారుణం

- బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి
- శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి అన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులు, రెజ్లర్లపై మోడీ ప్రభుత్వ దాడి, అరెస్టులను నిరసిస్తూ నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యాన మహిళలు గురువారం నిరసన తెలిపారు. లైంగిక దాడులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై పోక్సో చట్టం కింద అరెస్టు చేసి, పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గౌరవం, న్యాయం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు. దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల ఫిర్యాదును నమోదు చేయకుండా పోలీసులు తిరస్కరించారని చెప్పారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని కేసులు నమోదు చేయాలని ఆదేశించినా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదని చెప్పారు. లైంగిక దాడులపై కమిటీ నివేదిక బహిర్గతం చేయడానికి సైతం ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నిరాకరించడం అన్యాయమన్నారు. బిజెపి ఎంపీతో పాటు రెజ్లర్ల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్, అప్పటి క్రీడామంత్రి, కొందరు కోచ్‌లు సైతం లైంగిక దాడులకు పాల్పడ్డారని చెప్పారు. లైంగిక దాడులకు పాల్పడిన బిజెపి ఎంపీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రెజ్లర్లపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. నిరసనకారులపై క్రూరమైన దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై దాడుల అంశంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యాన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కె.ఆదిలక్ష్మి, ఎస్.దుర్గ, స్వాతి, సిహెచ్.లక్ష్మి, అమ్మాజీ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న స్పీకర్, మంత్రి, కలెక్టర్ తదితరులు

రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్ఆర్ రైతుభరోసా-పిఎం కిసాన్ కింద 2023-24 మొదటి విడత ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లాలో 3,15,544 మంది రైతులు, కౌలు రైతులు, అటవీభూముల సాగుదారులకు 2023 - 24 సంవత్సరానికి మొదటి విడత సహాయం కింద రూ.236.66 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతు వేసే ప్రతి అడుగుకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటూ రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నారని చెప్పారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ఖరీఫ్ పనులు ప్రారంభించక ముందే రైతుల ఖాతాలో ప్రభుత్వం నిధులు జమ చేస్తోందన్నారు. జిల్లాలో మార్చి, ఏప్రిల్, మేలో కురిసిన ఆకాల వర్షాల కారణంగా నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులు 251 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6.54 లక్షలను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు నమూనా చెక్కును అందజేశారు. వ్యవసాయ అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వ్యవసాయ బోర్డు జిల్లా అధ్యక్షులు నేతాజీ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, అగ్రి మిషన్ సభ్యులు గొండు రఘురాం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా ఉద్యాన అధికారి వరప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

మెట్కోర్ అల్లాయీస్‌ను తెరిపించాలి

టెక్కలి రూరల్ : ముందస్తు నోటీసు లేకుండా మూసివేసిన మెట్కోర్ అల్లాయీస్ పరిశ్రమను తెరిపించాలని కార్మికులు లేబర్ కమిషనర్‌కు కార్మికులు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఇల్లయ్య యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకులు, కార్మికులతో చర్చలు జరిపారు. గత కంపెనీ యాజమాన్యం కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ అంటూ అరకొర చెల్లింపులు చేసిందన్నారు. కార్మికులను నమ్మించి పాత యాజమాన్యం మోసం చేసిందన్నారు. రెండేళ్ల కిందట మెట్కోర్ అల్లాయీస్‌ను ప్రారంభించారని చెప్పారు. కొత్త యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల జీతాల్లో కోత పెట్టిందని చెప్పారు. పనులు నిలుపుదల చేస్తూ వేధింపులకు పాల్పడిందన్నారు. తక్షణం పరిశ్రమను తెరిపించి, బకాయి జీతాలు చెల్లించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యాజమాన్య ప్రతినిధులను ఆదేశించారు. గతంలో కార్మికులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, ఫుల్ అండ్ ఫైనల్ చెల్లింపుల్లో అన్యాయంపై కోర్టును ఆశ్రయించాలని కార్మికులకు సూచించారు. చర్చల్లో మెట్కోర్ అల్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిట్ట గంగయ్య, బోసు, మురళి, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, యాజమాన్య ప్రతినిధులు శంకరయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో స్కామ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సంక్షేమం పేరుతో ప్రభుత్వం స్కామ్‌లకు పాల్పడుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి పథకానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కుడే తప్ప నగదు జమ కావడం లేదని విమర్శించారు. నిధులు ఏమైపోతున్నాయని, ఎవరి ఖాతాల్లోకి వెళ్తున్నాయని ప్రశ్నించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 400 మందికి పైగా అమ్మఒడి పడలేదని, ఈ అంశంపై స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. జిల్లాలో ఇంత అసమర్థ గల అధికారులను ఎన్నడూ చూడలేదన్నారు. చంద్రబాబు గతంలో అమలు చేసిన పథకాలనే ఈ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, విదేశీ విద్య, వైఎస్సార్ పెళ్లి కానుక పేర్లతో అమలు చేస్తోందన్నారు. 2014లో 134 పథకాలను ప్రవేశపెడితే వైసిపి ప్రభుత్వం వంద పథకాలను రద్దు చేసి కేవలం 34 పథకాలనే అమలు చేస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో ఏం సాధించారని సభలు, ర్యాలీలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

సామాజిక తరగతికి ఒక కార్పొరేషన్ పెట్టారే తప్ప ఏ ఒక్కరి మేలు చేకూరలేదని చెప్పారు. రాష్ట్రంలో కీలక శాఖల్లో మంత్రులుగా ఉన్న ఇద్దరు మంత్రులు జిల్లాకు చేసిందేమీ లేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్, పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు పూర్తి చేయలేకపోయారని చెప్పారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారాపు వెంకటేష్, ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, తోణంగి వెంకన్న యాదవ్, డివిజన్ ఇన్‌ఛార్జులు సూరిబాబు, బొనిగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

ప్రజాశక్తి - ఆమదాలవలస

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని కుద్దిరాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్ల లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అవినీతికి ఆస్కారం లేకుండా అందుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడాను ప్రజలు గ్రహించాలన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ఎవరికైనా పథకాలు అందకపోతే, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బోర చిన్నంనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, సాధు చిరంజీవి, మామిడి రమేష్ పాల్గొన్నారు.

రాజగోపాలరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నిరంతర స్ఫూర్తి రాజగోపాలరావు

ప్రజాశక్తి- పోలాకి

నిస్వార్థరాజకీయాల్లో.. నిర్విరామ ప్రజాసేవలో నిరంతర స్ఫూర్తి కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు అని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని సుసరాంలో మాజీ ఎంపీ రాజగోపాలరావు విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజగోపాలరావు కుటుంబంతో తనకెంతో ఆత్మీయ సంబంధాలు ఉన్నాయని అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తానూ, బొడ్డేపల్లి సత్యవతి ఎమ్మెల్యేలుగా కలిసి పనిచేశామని గుర్తు చేశారు. జిల్లా ప్రజలకు రాజగోపాలరావు ఎన్నో చిరస్మరణీయ సేవలు అందించారని అన్నారు. జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ గత తరంలోని స్ఫూర్తిమంతమైన నాయకుల్లో రాజగోపాలరావు ఎంతో గొప్పవారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, కలింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి ఇన్‌చార్జి దువ్వాడ వాణి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్లు రాజాపు హైమావతి, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి పాల్గొన్నారు.

రామారావును పరామర్శిస్తున్న స్నేహితులు

రామారావుకు స్నేహితుల అండ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: తమతో పాటు 1993-94లో పదో తరగతి చదివిన తోటి స్నేహితునికి కేన్సర్ వ్యాధి సోకిందని తెలియగానే వారు చలించిపోయారు. ఎలాగైనా స్నేహితునికి అండగా నిలవాలనుకున్నారు. వెంటనే అందుబాటులో ఉన్న స్నేహితులకు సమాచారం అందించారు. తలో ఓ చేయి వేసి కొంత మొత్తం సేకరించారు. వివరాల్లోకి వెళ్తే... బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని కొమ్ముపుట్టుగకు చెందిన తోట రామారావు వైద్యం కోసం తనతో పాటు పదో తరగతి చదివిన స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన ఆ పాటకు ప్రాణం పోద్దాం కథనానికి స్పందించిన వీరు గురువారం రామారావుకు రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం రామారావు స్నేహితులు మాట్లాడుతూ రామారావు కుటుంబ పరిస్థితి గుర్తించి, అతని వైద్యం కోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు.

అవగాహనతోనే మలేరియా నియంత్రణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పరిసరాల పరిశుభ్రత తో మలేరియాకు దూరంగా ఉండొచ్చని పలాస సబ్ యూనిట్ అధికారి నల్లా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వెంకటాపురం, గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిధిలో మలేరియా మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలన్నారు. అలాగే నిల్వ ఉన్న నీటిని పరిసరాల్లో ఉండకుండా చూసుకునే బాధ్యత ప్రజలకు ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు దేవి, అంజలి, సుధీర్, ప్రత్యూష సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, పిహెచ్‌ఎన్ అనురాధ, ఫార్మసీస్టు బి.గోపాల్, స్టాఫ్‌నర్స్ పూల కుమారి, భవాని, అనూష, ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: అవగాహనతోనే మలేరియా వ్యాధి నియంత్రణ సాధ్యమని జలుమూరు పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ చిన్న రాజులు అన్నారు. జలుమూరు మండల కేంద్రంలోని ఎస్‌టి వీధిలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఎస్.పద్మావతి, పిహెచ్‌ఎన్ రాజ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- పొందూరు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బస్టాండు వద్ద పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుమ్ము, ధూళి, దుర్గంధం, అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా మురుగునీరు అంతా శుభ్రం చేస్తూ ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారని అన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిపై పాలకులకు కనికరం లేకపోవడం బాధాకరమన్నారు. చాలీచాలని వేతనాలతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలు ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, మరో వైపు గత నాలుగేళ్లుగా కార్మికులకు వేతనాలు పెంచకపోవడంతో కార్మికుల జీవనం కష్టంగా ఉందని అన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. పదిహేను రోజులు ముందు సమ్మె నోటీసు అందజేసినా స్పందించకపోవడంతో గత్యంతరం లేక సమ్మె చేపట్టారని అన్నారు. అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి యూనియన్‌తో చర్చించి పారిశుధ్య కార్మికులసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.నాగరాజు, పి.కనకరాజు, పి.కొండయ్య, సిహెచ్.కనకమ్మ, పి.కనకలక్ష్మి, పి.బుజ్జి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలో టెక్కలి, కోటబొమ్మాళి, కొత్తూరు, సారవకోట ఐసిడిఎస్ కార్యాలయాల పరిధిలోని పలు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు సజావుగా సాగాయి. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎండిహెచ్ఒ లక్ష్మీతులసి, ఐసిడిఎస్ పీడీ జయదేవి, పిఒలు శోభారాణి, హైమావతి, విమలకుమారి, కామాక్షి పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వే పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని అమిన్‌సాహెబ్‌పేటలో చేపడుతున్న భూ రీ సర్వే పనులను చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా ఉంటే మూడు నుంచి ఐదు రోజుల్లో మొత్తం డ్రోన్లతో ఫొటోలు తీసి పూర్తి చేస్తామని సర్వే బృందం ఆమెకు తెలిపారు. అనంతరం కమిషనర్ రమేష్‌తో కలిసి డ్రోన్ పైకి ఎగురవేయడాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, కో-ఆప్షన్ మెంబరు సాలీనా డిల్లీ, ప్రకాష్ పట్నాయక్, పురుషోత్తపురం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

పురపాలక సంఘం పరిధిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని రాజ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు తహశీల్దార్ గురుప్రసాద్‌ను గురువారం కలిసి వివరించారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యులు రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. 1, 8,10,11 రేషన్ కార్డుల సమస్యలు, ఇళ్ల పట్టాలు ఇచ్చిరని, ఇప్పటి వరకు లబ్ధిదారులకు స్థలాలు చూపించలేదని వివరించారు. ఈమెతో పాటు వార్డు కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, మధుమూర్తి, తేజేశ్వరరావు, ఆది రెడ్డి, కో-ఆప్షన్ మెంబరు సాలీనా డిల్లీ, ప్రకాష్ పట్నాయక్ పాల్గొన్నారు.

వివరాలను అడిగి తెలుసుకుంటున్న రాజ్యలక్ష్మి

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రామకృష్ణాపురం ఉజ్జుడు మెట్ట రైతులకు మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బాధిత పరిసర ప్రాంత రైతుల సంఘం అధ్యక్షులు సాద్ర శ్రీనివాసరావు అన్నారు. ఉజ్జుడుమెట్ట వద్ద గురువారం రైతులు నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతేడాది ఆగస్టులో తమ భూమి పత్రాలు తమకు రెండు నెలల్లో పట్టాలు ఇప్పిస్తామని మంత్రి, పలాస తహశీల్దార్ మధుసూధనరావు హామీనిచ్చారని గుర్తు చేశారు. 10 నెలలు గడుస్తున్నా ఆ విషయమై స్పందించకపోవడాన్ని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా వ్యవసాయానికి నోచుకోక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్నది వ్యవసాయ కాలమని, ఈలోగా తమ భూములు తమకు స్వాధీనం చేయాలని కోరారు. పలాస రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు కొమ్ముకాస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, వంకల మాధవరావు, మద్దిల రామారావు, కుసుమ, రైతులు నీలవేణిలు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

ఆలస్యంగా వెలుగులోకి...

ఇచ్ఛాపురం : పట్టణంలోని గొల్లవీధిలో ఆరేళ్ల బాలికపై అదే వీధికి చెందిన 50 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితం ఆరుబయట ఉన్న చిన్నారిని సదరు వ్యక్తి ఓ గదిలోకి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి ప్రయత్నించారు. ఇంతలో కుటుంబ సభ్యులు, వీధి వాసులు చూసి సదరు వ్యక్తికి దేహశుద్ధి చేసి విడిచిపెట్టారు. వారం రోజులు తరువాత గురువారం సదరు వ్యక్తితో బాలిక కుటుంబ సభ్యులు ఘర్షణ పడ్డాడు. దీంతో విషయం బయటకు పొక్కడంతో చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు రంగంలోకి దిగి కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణ ఎస్ఐ గోవిందరావు విచారణ చేపట్టి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

పొందూరు: మండలంలోని లోలుగు కాలనీ సమీపంలో గురువారం వేకువజామున జరిగిన రహదారి ప్రమాదంలో విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని కాగాంయిఅ చెందిన ఎం.మురళీకృష్ణ గాయపడ్డాడు. మురళీకృష్ణ మామిడి పళ్లు ఆటోతో శ్రీకాకుళం వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా ఆగడంతో ఆటో అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ తలకు, చేతికి బలంగా గాయాలయ్యాయి. వెంటనే 108లో స్థానికులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

శ్రీకాకుళం: ఉద్యోగ విరమణ తరువాత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉద్యోగ విశ్రాంత హోంగార్డుకు ఎస్‌పి జి.ఆర్.రాధిక సూచించారు. జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కె.త్రినాథరావును జిల్లా పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి గురువారం దుశ్శాలువుతో సన్మానించి జ్ఞాపకను, ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు. సత్కరించారు. అనంతరం ఆయనకు తక్షణ సాయంగా రూ.5 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేశారని, సుధీర్ఘకాలం పాటు కేటాయించిన అన్ని విధులు చక్కగా నిర్వర్తించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి సాయం అవసరమైనా పోలీసుశాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ బి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న సూర్యకిరణ్

పిఎం బీమా అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో చేరాలని డేఅండ్‌నైట్ కూడలి యూనియన్ బ్యాంకు ఎల్‌డిఎం సూర్యకిరణ్ అన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా ఇటీవల సాధారణ మృతి చెందిన పొన్నాడ వీరబ్రహ్మం భార్య లక్ష్మికి బీమా పథకం రూ.2 లక్షల నమూనా చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు సేవలందించడంలో ముందుంటారని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డే నైట్ ఆర్‌సిబి శాఖలో హౌసింగ్ రుణాలు, వ్యాపారస్తులకు బిజినెస్ రుణాలు, గోల్డ్ రుణాలు, రైతులకు పంట రుణాలు, మహిళా సంఘాలకు రుణాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీమా సంస్థ అధికారి సురేష్ కుమార్, రిలేషన్‌షిప్ మేనేజర్ హైమావతి, జగదీష్, బ్రాంచ్ సిబ్బంది వెంకటరాజు, లక్ష్మి, ఉపేంద్ర, స్వాతి, సంధ్య, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

మున్సిపల్ కమిషనర్‌గా నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన 2014లో పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. కరోనా సమయంలో పలాసకు చెందిన వ్యక్తి కరోనా సోకి మృతి చెందడంతో కమిషనర్ ప్రమేయం లేకుండా పారిశుధ్య అధికారులు ఆ మృతదేహాన్ని ప్రొక్లెయినర్‌లో తరలించడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనికి కమిషనర్ బాధ్యుడుని చేస్తూ ప్రభుత్వం నాగేంద్రకుమార్‌ను సస్పెండ్ చేసింది. అనంతరం జివిఎంసిలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన కమిషనర్ రాజగోపాల్ ఉద్యోగోన్నతిపై కర్నూలు జిల్లా ఆహార శాఖాధికారిగా బదిలీపై వెళ్లిపోయాడు. ఆయన స్థానంలో నాగేంద్రకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయనకు మున్సిపల్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, కౌన్సిలర్ సవర సోమేష్, బెల్లాల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

సముద్రంలోకి తాబేళ్లు విడుదల

సోంపేట: మండలంలోని బారువ సముద్రంలోకి 500 ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను గురువారం విడిచిపెట్టినట్లు మెరైన్ సిఐ రమేష్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జనవరి నుంచి మే నెల మధ్యలో ఆలీ తాబేళ్లు ఈ తీర ప్రాంతానికి వచ్చి గుడ్లు పెడుతుంటాయని తెలిపారు. స్థానిక అటవీశాఖ అందించే ఆర్థిక సాయంతో ట్రీ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ గుడ్లను పొదిగి తాబేలు పిల్లలను తిరిగి సముద్రంలోకి విడిచి పెడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులతో పాటు స్థానిక మత్స్యకారులు సైతం సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది క్రాంతికుమార్, శేషయ్య, మత్స్యకారులు చంద్రయ్య, తాతారావు, కామయ్య పాల్గొన్నారు.

తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న సిఐ రమేష్

ఎమ్మెల్యే అశోక్ పరామర్శ

సోంపేట : మండలంలోని మామిడిపల్లికు చెందిన జిల్లా సొండి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టిడిపి నాయకుడు సాహుకారి దివాకరరావును ఎమ్మెల్యే బెందాళం అశోక్ గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న దివాకరరావు గురించి సమాచారం తెలుసుకుని పరామర్శించారు. ఈయన వెంట జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్, సొంది కుల రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, రాష్ట్ర డైరెక్టర్ పాండవ భారతి శ్రీనివాస్ ఉన్నారు.

సోంపేట : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కిరణ్‌కుమార్...

లావేరు : మండలంలోని బుడుమూరు ఎంపిటిసి సభ్యులు బొడ్డ సూరీడమ్మను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం పరామర్శించారు ఎంపిటిసి కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలియపరిచారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయతో పాటు సర్పంచ్ ప్రతినిధి పెదనాయని చిట్టిబాబు, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డ రవిబాబు, కింతలి కోటీశ్వరరావు, పి.సత్యనారాయణ, బి.సంజీవరావు, అచ్చిబాబు, జి.రవి, కె.ప్రసాద్, అప్పలరాజు ఉన్నారు.

నేడు రిలే నిరాహార దీక్ష

పలాస : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 2న నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ పలాస-కాశీబుగ్గ యూనిట్ అధ్యక్షులు నల్లాన లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, గ్రామవార్డు సచివాలయ ఉ ద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారానికి ఈ రిలే నిరాహార దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఉద్యోగులందరూ పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బన్నువాడలో గడప గడపకు..

టెక్కలి : సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని జెడ్‌పిటిసి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని ఆయోధ్యాపురం పంచాయతీ బన్నువాడలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమల చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోలాకి మోహనరావు, బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, మెర్రి శంకరరావు, పొందర శ్రీనివాసరావు, రౌతు జయమోహన్, ఎంపిటిసి పోలాకి సోమేశ్వరరావు, బుసకల శ్రీనివాసరావు, ఆట్ల రవి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నరసన్నపేట : నరసన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన దుంపల భాస్కరరావు మార్కెట్ కమిటీ ఆవరణలో ఎమ్మెల్యే కృష్ణదాస్ అధ్యక్షతన గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతోపాటు వైస్ చైర్మన్ దంత సింహాచలం, డైరెక్టర్లు వేలాల వెంకటరమణ, అడ్ల చంద్రావతి, పాశిన సరోజిని, రావాడ అప్పన్నరాజు, గేదెల వరలక్ష్మి, గొర్లె కుమారి, తోట ముద్దమ్మ, మేడి రూపావతి, సతివాడ ఉమాదేవి, రాజాన సూరమ్మ, పంచిరెడ్డి సత్యనారాయణ, వారణాశి సత్యనారాయణ, కోరాడ చిన నర్సింహమూర్తి కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

'ఎంజిఆర్' ఆర్థికసాయం

కొత్తూరు : మండలంలోని శోభనాపురంలో అభయాంజనేయ స్వామి ప్రతిష్ట మహోత్సవంలో టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు గురువారం సందర్శించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.15 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఊయక సురేష్, కొండ గొర్రె మన్మథరావు, కోలక వెంకీ, ఉయక రవి, పాలక మోహన్, బిడ్డికి లక్ష్మీనారాయణ, ఉయక మల్లేష్, ఆరిక జయరాజు, పాలక ధర్మారావు పాల్గొన్నారు.

జిఆర్‌పి పోలీసులకు సూచనలు ఇస్తున్న మోహనరావు

జిఆర్‌పి పోలీస్‌స్టేషన్ తనిఖీ

పలాస: పలాస జిఆర్‌పి పోలీస్‌స్టేషన్‌ను విశాఖపట్నం లైన్ ఇన్‌స్పెక్టర్ బి.మోహనరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు కార్యాలయం రికార్డులు, రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం జిఆర్‌పి కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైలులో మత్తు పదార్థాలు గంజాయి, నల్లా మందు తదితర వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైల్వే స్టేషన్‌కు వస్తున్న ప్రయాణికులపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారిపై దృష్టి సారించాలన్నారు. ఆయనతో పాటు విశాఖపట్నం జిఆర్‌పి లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, ఎస్ఐ షరీఫ్, శ్రీకాకుళం ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కమిషనర్ నాగేంద్రకుమార్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే వాటికి తగ్గట్టుగా ఆదాయం ఉండాలని, అందుకు మున్సిపాలిటీలో ఇంకా వసూళ్లు కాని వివిధ రకాల పన్నులు మున్సిపల్, సచివాలయం సిబ్బంది వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

విద్యార్థులకు ఆణిముత్యాలు పురస్కారం

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల

పలాస: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించారని, దీంతో విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. బైపిసిలో వజ్జ వెన్నెల (945 మార్కులు), హెచ్‌ఎస్‌ఇసిలో ఇప్పిలి చామంతి 925 మార్కులు, సిఇసిలో సవర గీత 887 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ఈ పురస్కారాలకు ఎంపికయ్యారని అన్నారు. వీరికి త్వరలో నగదు బహుమతి రూ.15 వేలుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తారని తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఎస్‌ఇసి, ఒకేషనల్ (సిఎస్ఇ, ఎఅండ్) గ్రూపుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలతో జిల్లాలోనే మా కళాశాల ప్రత్యేకత సాధించిందని తెలిపారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని ఏడో వార్డు చింతాడలో పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్ పింఛన్లను డిఆర్‌డిఎ ఎపిఒ బి.వి.వి.ఎస్.దొర గురువారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పింఛన్ల పంపిణీ ప్రక్రియకు ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్యతో అవాంతరం ఏర్పడింది. దీంతో మధ్యాహ్నం ప్రారంభమైన పింఛన్ల పంపిణీ వేగవంత మయ్యేలా చూడాలని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ ఆదేశాలు జారీ చేయడంతో దొర పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డి.మహేష్, ఎ.ఉమామహేశ్వర రావు, ఎం.రమేష్, బి.శోభన పాల్గొన్నారు.

పింఛన్‌ను పంపిణీ చేస్తున్న దొర

సంక్షిప్త వార్తలు

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

సవర కుమార్

మెళియాపుట్టి : జీడికి ప్రభుత్వం మద్దతు ప్రకటించాలని దండకరణ్య లెబరేషన్ ఆర్గనైజేషన్ (డిఎల్‌ఒ) జిల్లా అధ్యక్షులు సవర కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో జీడి రైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కంటే జీడి పిక్కల ధర తగ్గిందని అన్నారు. జీడిపప్పు ధర గతేడాది కంటే పెరిగిందని అన్నార. జీడి పిక్కలు బస్తా ధర 12,000 ఉన్నప్పుడు పప్పు కిలో రూ.650 ఉండేదని అన్నారు. జీడి పప్పు ధర కిలో రూ.850 ఉంటే, 80 కిలోల పిక్కలు బస్తా ధర రూ.8 వేలు పలుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కనీస మద్దతు రూ.16 వేలు ప్రకటించాలని కోరారు.

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ల బదిలీ

పొందూరు: ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎస్.ఎం.పురం పరిధిలోని ఎచ్చెర్ల, పొందూరు, జి.సిగడాం మండలాల సూపర్‌వైజర్లు బదిలీ అయినట్లు సిడిపిఒ డి.పాపినాయుడు గురువారం తెలిపారు. పొందూరు మండలంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ జి.వి.రత్నంను సోంపేట ప్రాజెక్టుకు, ఎచ్చెర్ల మండలంలో పనిచేస్తున్న యశోదను శ్రీకాకుళం ప్రాజెక్టుకు, జి.సిగడాం మండలంలో పనిచేస్తున్న రజినిదుర్గను రాజాం ప్రాజెక్టుకు బదిలీ అయ్యారని అన్నారు. అలాగే యూడిసి వంశీలత పాలకొండకు బదిలీ అయినట్లు తెలిపారు.

వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నందిగాం : ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ శ్రీకాంత్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి వరి, పచ్చి రొట్ట విత్తనాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నందిగాం-1 ఆర్‌బికెలో ప్రారంభమైందని అన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు కట్టిన వారికి మాత్రమే విత్తనాలు సరఫరా చేస్తామని అన్నారు. రైతులు తమ ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాని వెళ్లాలని సూచించారు.

వైద్య శిబిరానికి స్పందన

ఆమదాలవలస : పట్టణంలోని మెండ విమలమ్మ స్వచ్ఛంద సంస్థ ఏడో వార్షికోత్సవం సందర్భంగా చిట్టెమ్మ క్వార్టర్స్ సిలోహు ప్రార్థన మందిరం ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 500 మంది రోగులకు నేత్రాలు, గుండె, బిపి, సుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం స్థానిక పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యాన సువార్త దండ యాత్ర చేసి బైక్ ర్యాలీ నిర్విహించారు. ఇందులో భాగంగా సీనియర్ దైవ సేవకులు రెవ ఆనందరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మెండ శామ్యూల్, సాల్మన్ పాల్గొన్నారు.